క్లుప్తంగా

డిప్యూటీ తహసీల్దార్‌గా శ్రీరాములు



తహసీల్దార్ వేణుగోపాల్‌కు జాయినింగ్ లెటరు ఇస్తున్న డిప్యూటీ తహసీల్దార్ శ్రీరాములు

వై.రామవరం: మండల డిప్యూటీ తహసీల్దార్‌గా కె.శ్రీరాములు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన తహసీల్దార్ పి.వేణుగోపాల్‌కు జాయినింగ్ లెటర్‌ను అందజేశారు. అనంతరం కార్యాలయ సిబ్బందిని పరిచయం చేసుకున్నారు. ఆర్ఐ గుడ్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సీడీపీవోగా క్రాంతికుమారి



అడ్డతీగల: ఐసీడీఎస్ అడ్డతీగల ప్రాజెక్ట్ సీడీపీవోగా పి.క్రాంతికుమారి శనివారం బాధ్యతలు స్వీకరించారు. కోనసీమ జిల్లా రాజోలు ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తూ సీడీపీవోగా పదోన్నతి పొంది అడ్డతీగల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీవోగా ఆమె నియమింపబడ్డారు. ప్రాజెక్ట్ పరిధిలో ప్రభుత్వ లక్ష్యం మేరకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ, చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పించడం వంటివి సక్రమంగా అమలయ్యేలా పటిష్టమైన చర్యలు తీసుకుంటామని సీడీపీవో క్రాంతి కుమారి చెప్పారు.

పింగళి వెంకయ్యకు ఘన నివాళి



పింగళి వెంకయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ భరత్‌కుమార్ నాయక్ తదితరులు

అరకులోయటౌన్: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పింగళి వెంకయ్య జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్స్‌పాల్ డాక్టర్ కె.భరత్ కుమార్ ఆధ్వర్యంలో పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పింగళి వెంకయ్య జాతీయ జెండా రూపకల్పన, ఆవశ్యకత, గొప్పతనాన్ని కొనియాడారు. ఎన్ఎస్ఎస్ పీవోలు నాగబాబు, వై.విజయలక్ష్మీ, ఎం.అనిత కుమారి మాట్లాడుతూ స్వాతంత్య్ర ఉద్యమ ఘట్టాల్లో పింగళి వెంకయ్య ముఖ్య పాత్ర పోషించారన్నారు. వైస్ ప్రిన్స్‌పాల్ డాక్టర్ పి.కొండబాబు, అధ్యాపకులు గణేష్, కొండబాబు, లచ్చన్న, కామేశ్వరరావు, అప్పారావు, సోంబాబు, సురేష్, భవాని విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదివాసీ చట్టాలపై అవగాహన



అవగాహన కార్యక్రమంలో విద్యార్థులు

ఎటపాక: ఆదివాసీ చట్టాలపై యువత అవగాహన కలిగి ఉండాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను అన్నారు. ఆదివాసీ నవోత్సవాల్లో భాగంగా శనివారం ఎటపాకలోని బాలికోన్నత ప్రాథమిక ఆశ్రమ పాఠశాల, వైటీసీ విద్యార్థులకు ఆవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్యను అభ్యసించి అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. భావితరాల భవిష్యత్ కోసం చట్టాలు, హక్కులు తెలుసుకోవాలని సూచించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సోమ, మంగళ వారాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

కూనవరం: సోమ, మంగళవారాల్లో మండలంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు అందుకు సహకరించాలని రంపచోడవరం ఈఈ (ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్) గాబ్రియల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భీమవరం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పాడైన పాత ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి, దాని స్థానంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేస్తున్నట్టు తెలిపారు. అందువల్ల విద్యుత్ అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

జి.మాడుగుల: మండలంలో గెమ్మెలి పంచాయతీ చీమకూరపాలెం గ్రామంలో తాగునీటి పథకాన్ని శనివారం సర్పంచ్ సీదరి కొండబాబుకు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ చంద్రకిరణ్, ఏఈ విజయ్‌కుమార్ అప్పగించారు. గ్రామంలో తాగునీరు–పారిశుధ్యం కమిటీలను ఏర్పాటు చేసి పథకాన్ని నిర్వహణ, పరిశుభ్రతపై వారు అవగాహన కల్పించారు. తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. పాడైన బోర్లు, పైపులైన్‌లకు మరమ్మతు చేయిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కృష్ణ, ఈఏ ప్రభాకర్, ఎంఆర్‌సీ సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణం.. ప్రమాదకరం

- కోతకు గురైన వంతెనలు, కల్వర్టులు
- పెరుగుతున్న ప్రమాదాలు
- ఆందోళనలో గ్రామస్తులు
- వర్షం పడితే ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు

అరకులోయటౌన్:

గిరిజన ప్రాంతంలో రహదారులు, కల్వర్టులు, వంతెనలు అధ్వానంగా మారాయి. పలు గ్రామాల్లోని కల్వర్టులు వంతెనలు శిథిలావస్థకు చేరాయి. కూటమి ప్రభుత్వం మన్యం ప్రాంత సమస్యలపై కనీసం దృష్టి సారించడం లేదు. దీంతో అధ్వాన రహదారుల్లో రాకపోకలు సాగించే వాహనచోదకులందరూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారిపై నిత్యం అధికారులు రాకపోకలు సాగిస్తున్నా కనీసం పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు.. ఈ మార్గంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రహదారులన్నీ సుందరంగా తీర్చిదిద్దుతామని ఎన్నికల ప్రచారంలో వాగ్దానాలు చేసిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ప్రధాన రహదారులు బాగుచేసినా దాఖలాలు లేవని గ్రామస్తులు చెబుతున్నారు.

రహదారులు బాగు చేసేందుకు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో మండల కేంద్రంతో పాటు వారపు సంతలకు వచ్చేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికై నా కూటమి ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి రోడ్లు బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కుంగిన వంతెన

అరకులోయ– పాడేరు రహదారిలోని యండపల్లి వలస సమీపంలోని బురద గెడ్డ వంతెన వద్ద బ్రిడ్జి కోతకు గురై చాలా ప్రమాదకరంగా మారింది. ఈ వంతెన వద్ద అనేక ప్రమాదాలు చోటు చేసుకున్నా పాలకులు, అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. ప్రమాదకరంగా కుంగిన వంతెన వద్ద ఎటువంటి పనులు చేపట్టకపోవడంపై పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా వంతెన వద్ద కోతకు గురై ప్రమాదకరంగా మారిన ప్రదేశంలో బాగు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రముఖ సందర్శిత ప్రాంతమైన రణజిల్లెడ– హట్టగుడ రహదారిలో కల్వర్టు కోతకు గురైంది. ఈ రహదారి మీదుగా వందలాది వాహనాలు రాకపోకలు సాగుతుంటాయి. ప్రమాదాలు చోటుచేసుకోకుండా ముందు కల్వర్టు బాగు చేయాలని ప్రజలు, పర్యాటకులు కోరుతున్నారు.



కోతకు గురైన కోడిపుంజువలస- వర్రా కాజ్‌వే



అరకు-పాడేరు రహదారిలో యండపల్లివలస వద్ద ప్రమాదకరంగా మారిన వంతెన



గన్నెల రైలు అండర్ బ్రిడ్జి సమీపంలో అధ్వానంగా మారిన కల్వర్టు



రణజిల్లెడ- హట్టగుడ రింగ్‌రోడ్డులో శిథిలమైన కల్వర్టు

అధ్వాన దారులతో ఆటంకం

విశాఖ–అరకు రహదారిలోని గన్నెల జంక్షన్ నుంచి గన్నెల గ్రామం వరకు సుమారు 6 కిలోమీటర్లు రహదారి దారుణంగా మారింది. రాళ్లు తేలి, కోతకు గురైన రహదారిపై ప్రయాణానికి నానా అవస్థలుపడుతున్నారు. ఈ రహదారి మీదుగా సుంకరమెట్ట వారపు సంతకు లోతేరు, ఇరగాయి, గన్నెల, బొండాం, మాదల, పెదలబుడు, కొత్త భల్లుగుడ పంచాయతీ వాసులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులు, వాణిజ్య పంటలను ఈ రహదారి మీదుగా తీసుకువెళ్లెందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైలు అండర్ బ్రిడ్జి సమీపంలోని వంతెన ఇటీవల కొట్టుకుపోయింది. తూతూ మంత్రంగా పైపులు వేసి గ్రావెల్, క్రషర్ డస్ట్ వేసి విడిచి పెట్టారు. వర్షం పడితే ఈ రహదారిలో ప్రయాణం నరకప్రాయమని ఈ ప్రాంత ప్రజలు అంటున్నారు.

గోతులతో సతమతం

సుంకరమెట్ట నుంచి జనంగుడ, మాడగడ, చొంపి, శిరగాం పంచాయతీ మీదుగా డుంబ్రిగుడ మీదుగా పెదపాడు గ్రామాల మీదుగా నిర్మించిన రహదారి శిథిలమై రాళ్లు తేలి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. ముఖ్యంగా ఎం. హట్టగుడ–మాడగడ మధ్యలో సుమారు 20 మీటర్లు రహదారి గోతిలో బురద చేరి రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతుంది. ద్విచక్రవాహన చోదకులతో పాటు ఆటోలు ప్రయాణానికి అవస్థలు పడుతున్నారు. రహదారి బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రహదారి బాగు చేయాలి



ప్రతీ రోజు పద్మాపురం వయా రణజిల్లెడ హట్టగుడ రహదారిలో దేశ విదేశాల నుంచి పర్యాటకులు, స్థానికులు రాకపోకలు సాగిస్తుంటారు. రహదారి బాగులేక నానా అవస్థలు పడుతున్నారు. రాత్రిళ్లు ఆదమరచి ప్రయాణిస్తే తీవ్ర ప్రమాదం జరిగే అవకాశం ఉంది. కూటమి ప్రభుత్వం ఇప్పటికై న స్పందించి పర్యాటక ప్రాంరత రహదారి బాగు చేయాలి.

– పెట్టెలి సుస్మిత, సర్పంచ్, పద్మాపురం పంచాయతీ, అరకులోయ

ప్రమాదాల బారిన వాహనచోదకులు



మండల కేంద్రం నుంచి నాలుగు పంచాయతీల రోజు ఈ రహదారి మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. రహదారి శిథిలావస్థకు చేరడంతో రాకపోకలకు నరకయాతన పడుతున్నా. ద్విచక్ర వాహనచోదకులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. కోడిపుంజువలస–శిరగాం రహదారి బాగుచేయాలి.

– పాంగి శ్రీరాములు, లంతంపాగు గ్రామం, అరకులోయ మండలం

డ్రగ్స్ అనర్థాలపై అవగాహన



పి.యర్రగొండలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రామకృష్ణ

వై.రామవరం: మత్తు పదార్థాల జోలికి పోయి అనారోగ్యాలు పాలవ్వవద్దని స్థానిక ఎస్ఐ బి.రామకృష్ణ విద్యార్థులకు సూచించారు. మండలంలోని పి.యర్రగొండ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో శనివారం అడ్డతీగల సిఐ బి.నరసింహమూర్తి ఆదేశాల మేరకు విద్యార్థులకు ఎస్ఐ బి.రామకృష్ణ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తుపదార్థాల అనర్థాలను విద్యార్థులకు వివరించారు. గుట్కాలు. ఖైనీలు వంటివాటిని సేవించడం వలన నష్టాలపై అవగాహన కల్పించారు. మత్తుపదార్థాలకు బానిసలు కావద్దని సూచించారు. ఎవరైన ర్యాగింగుకు పాల్పడితే తమకు తెలియజేయమని విద్యార్థినులకు సూచించారు. పాఠశాలల సెలవులకు గ్రామాలకు వెళ్లినప్పుడు మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను స్థానికులకు తెలియజేయాలన్నారు. గంజాయి సాగు, వ్యాపారం చట్టరీత్యా నేరమని అందుకు దూరంగా ఉండాలన్నారు. ఖైనీ, గుట్కాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. పాఠశాలలో సమీపంలో ఏ విధమైన దుకాణాలు పెట్టనివ్వవద్దని ప్రిన్సిపాల్, సిబ్బందికి సూచించారు. అనంతరం

పి.యర్రగొండ గ్రామంలోని దుకాణాలలో తనిఖీలు నిర్వహించారు. దుకాణాలలో ఏవిధమైన మత్తు పదార్థాలు, గుట్కాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని దుకాణ యజమానులను ఎస్ఐ రామకృష్ణహెచ్చరించారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపల్ భురా రామ్ భైరవ, వారి సిబ్బంది పాల్గొన్నారు.

ఆదివాసీలకు న్యాయం చేయాలి



గోమంగిలో జీపు జాతలో మాట్లాడుతున్న నాయకులు



జి.మాడుగులలో ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజన సంఘం నాయకులు

జి.మాడుగుల: మండల కేంద్రంలోని జీవో నెంబరు–3 సాధన కమిటీ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణరాజు అధ్యక్షతన శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఎస్సీలో ఏజెన్సీ టీచర్ పోస్టుల్లో ఏజెన్సీ ఎస్టీలకు 100 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఇటీవల జరిగిన డీఎస్సీలో గిరిజన ప్రాంత ఉద్యోగాలు అల్లూరి జిల్లాలో 400 పోస్టులకు గాను 24 పోస్టులు మాత్రమే ప్రభుత్వం కల్పించిందన్నారు. దీంతో ఆదివాసీ అభ్యర్థులకు తీరని అన్యాయం జరిగిందన్నారు. ఏజెన్సీలో ఉద్యోగాలు, ఉపాధ్యాయ పోస్టులన్నీ ఆదివాసీలకే ఇస్తామన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీలకు ప్రత్యేకమైన ఉద్యోగ భద్రత చట్టం తీసుకురావాలని కోరారు. ఆదివాసీ అభ్యర్థులకు న్యాయం చేయాలన్నారు. ఈనెల 8వ తేదీ వరకు జీపు జాతా రథసారధులు.ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ జిల్లా కన్వీనర్ సాగిన ధర్మన్న పడాల్, ఆదివాసీ నిరుద్యోగుల సంఘం జిల్లా కన్వీనర్ సాగిన సత్యనారాయణ, ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ జిల్లా కో–కన్వీనర్ కూడా రాధాకృష్ణ, కో–కన్వీనర్ సీహెచ్.రావు, మాధవ రావు, నిరుద్యోగుల సంఘం జిల్లా నాయకులు రాజు, ఆదివాసీ నిరుద్యోగుల సంఘం మండల నాయకులు సాయి, కళ్యాణం, ప్రసాద్, రాజునాయుడు తదితరులు పాల్గొన్నారు.

పెదబయలు: మండలంలోని బొంగరం, లింగేటి మీదుగా గోమంగిలో గ్రామాల్లో ప్రత్యేక డీఎస్సీ సాధన కమిటీ ఆధ్వర్యంలో జీపు జాత కార్యక్రమం శనివారం నిర్వహించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ జీవో నంబర్3 అమలు చేసి 100 శాతం ఉద్యోగాలు గిరిజన అభ్యర్థులతోనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి ప్రత్యేక డీఎస్సీ ప్రకటించి, గిరిజనులను నూరుశాతం రిజర్వేషన్‌తో భర్తీ చేయాలన్నారు. ప్రత్యేక డీఎస్సీ సాధన కమిటీ నాయకులు భాను, సత్తిబాబు, మత్స్యకొండబాబు, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి



అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

కొయ్యూరు: సామర్లకోటకు చెందిన కళాజాత బృందం శనివారం బూదరాళ్లలో అనేక అంశాలపై అవగాహన కల్పించింది. కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు సర్పంచ్ సాగిన ముత్యాలమ్మ, వార్డు సభ్యులు సంజీవ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిశరాలను శుభ్రంగా ఉంచుకోవాలని లేనిపక్షంలో దోమలు పెరిగి రోగాలు వస్తాయన్నారు. ప్రతీ ఒక్కరు వ్యక్తిగత మరుగుదొడ్డను నిర్మాణం చేసుకోవాలన్నారు. బాల్య వివాహాల నిర్మూలించాలన్నారు. బాల్య వివాహాల అనర్థాలను వివరించారు. గంజాయికి దూరంగా ఉండాలని, చెడు అలవాట్లను మానుకోవాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి లీలాకృష్ణ, డీప బాపురావు, నేతలు కొండబాబు, చంద్రరావు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

గంగవరం : తల్లిపాలు వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.కుమారి ఆధ్వర్యంలో శనివారం గర్భిణులు, బాలింతలకు ఆరోగ్యభద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమన్నారు. తల్లిపాల విశిష్టతను వివరించారు.గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. గర్భిణులు తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఆస్పత్రుల్లోనే ప్రసవాలు చేయించుకోవాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు లక్ష్మి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

46 మందికి వైద్య పరీక్షలు

ముంచంగిపుట్టు: మండలంలోని దారెల పంచాయతీ డి.కుమ్మరిపుట్టు గ్రామంలో కిలగాడ వైద్యాధికారి శిరిష ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 46మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శిరిష మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. దోమతెరలు వినియోగించాలని సూచించారు. అనారోగ్యమైతే తక్షణమే వైద్య సేవలు పొందాలన్నారు. ఎంఎల్‌హెచ్‌పీ తులసిరత్నం, ఏఎన్ఎంలు గౌరి, సుశీల, కాంతమ్మ ,ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించాలి



పెదకోడాపల్లిలోని కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీటీసీ బొంజుబాబు, నాయకులు



కురిడిలో పాల్గొన్న మండల పార్టీ అధ్యక్షుడు పరశురామ్, జెడ్పీటీసీ జానకమ్మ తదితరులు



మల్కరిపుట్టులో గ్రామస్తులతో మాట్లాడుతున్న మండల పార్టీ అధ్యక్షుడు పద్మారావు

పెదబయలు: మండలంలోని పెదకోడాపల్లి పంచాయతీ కేంద్రంలో జెడ్పీటీసీ సభ్యుడు కూడ బొంజుబాబు ఆధ్వర్యంలో శనివారం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుచేయకుండా మోసం చేస్తోందన్నారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను అటకెక్కించారని ఎద్దేవా చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇంటింటికీ రేషన్ పంపిణీ, రైతు భరోసా, వలంటీర్ వ్యవస్థ ద్వారా సుపరిపాలన అందించారన్నారు.అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం డిపోల ద్వారా రేషన్ పంపిణీ చేయడంతో సుదూరంలో ఉన్న ఆదివాసీలకు రేషన్ సరకులు పొందేందుకు నానా అవస్థలు పడుతున్నారన్నారు. గిరిజనులకు రేషన్ కష్టాలు మొదలయ్యాయన్నారు. ఏజెన్సీలో ఒక్క అభివృద్ధి పని చేయలేదన్నారు. రైతులకు పెట్టుబడి సాయం నేటికీ అందలేదన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు చేస్తున్న మోసాలతో కూడిన క్యూఆర్ కోడ్ స్కానర్ పోస్టర్‌లను ఆవిష్కరించారు.

రాష్ట్రంలో కూటమీ ప్రభుత్వం అక్రమ అరెస్టులు, రెడ్‌బుక్ రాక్షసపాలన సాగిస్తుందన్నారు.

కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఎంపీటీసీ సభ్యుడు పాంగి అప్పారావు, సర్పంచ్ బట్టి చిట్టిబాబు, నాయకులు కొండబాబు, వార్డు సభ్యులు రుత్‌కుమార్, గోపాల్, కృష్ణభూపతినాయుడు, మోహన్, కృష్ణారావు, ప్రసాద్, సత్యనారాయణ, కామరాజు, రమణమూర్తి, సూరిబాబు, లుక్కి పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: మండలంలోని కండ్రుమ్, కురిడి పంచాయితీల్లో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి పరశురామ్, జెడ్పీటీసీ సభ్యురాలుసీహెచ్.జానకమ్మ ఆధ్వర్యంలో శనివారం బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ మరింత బలోపేతం కోసం సమిష్టిగా కృషి చేయాలని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీలు అన్ని స్థానాలు గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామాల్లో గడపగడప తిరుగుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను వివరించారు. చంద్రబాబు మోసాలకై క్యూర్‌కోడ్ స్కాన్ చేయించి కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను వివరించారు. వైస్ ఎంపీపీలు శెట్టి ఆనంద్, పి.లలిత, మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు కె హరి, గుంటసీమ, కురిడి సర్పంచ్‌లు గుమ్మ నాగేశ్వరరావు, లచ్చు, మండల మహిళ అధ్యక్షురాలు శాంతి, బూత్ కమిటీ అధ్యక్షుడు మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: మండలంలో గల కిలగాడ, వనభసింగి,పెదగూడ, కించాయిపుట్టు పంచాయతీల్లో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాంగి పద్మారావు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పథకాలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన వ్యక్తి చంద్రబాబునాయుడు అని అన్నారు. చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించారన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అరాచక పాలన సాగుతుందన్నారు. పార్టీ శ్రేణులు గ్రామాల్లో పర్యటించి కూటమి ప్రభుత్వం మోసాలను ప్రజలకు వివరించాలని కోరారు. జెసిఎస్ ప్రధాన కార్యదర్శి జగబంధు, వైఎస్సార్‌సీపీ నాయకులు మూర్తి, జయదేవ్, సన్యాసిరావు, తిరుపతిరావు, అర్జున్, నీలకంఠం, నోబ్బో, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సన్మానం



హెచ్ఎం దంపతులను సన్మానిస్తున్న ఎంఈవో శెట్టి సుందరరావు తదితరులు

డుంబ్రిగుడ: మండలంలోని తూటంగి పంచాయతీ గేదల బంద మోడల్ ప్రైమరీ పాఠశాలలో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన ప్రధానోపాధ్యాయురాలు యు.రజితను ఘనంగా సన్మానించారు. మండల కేంద్రంలోని ఎంపీపీ పాఠశాలలో ఎంఈవో శెట్టి సుందర్‌రావు ఆధ్వర్యంలో ఆత్మీయ సత్కారం కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మండలంలోని విద్యాభివృద్ధికి ఉపాధ్యాయురాలు రజిత విశేష సేవలందించారన్నారు. కార్యక్రమంలో భాగంగా రజిత, విలియం కేరి దంపతులను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

హుకుంపేట: మండల కేంద్రంలోని గిరిజన సంఘం రాష్ట కార్యదర్శి కిల్లో సురేంద్ర, మండల కార్యదర్శి తావుల కృష్ణారావు ఆధ్వర్యంలో శనివారం సమావేశం జరిగింది.ఈసందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ ఆదివాసీ దినోత్సవాలను ఘనంగా నిర్వహించాలన్నారు. ప్రత్యేక డీఎస్సీని కూటమి ప్రభుత్వం ప్రకటించి ఆదివాసీ అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరారు. ఎస్.హైమావతి, వైస్ ఎంపీపీ కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌లో సీఐటీయూ మండల కార్యదర్శి శంకరరావు ఆధ్వర్యంలో విద్యుత్ కార్మికుల సమావేశం శనివారం నిర్వహించారు. సమస్యలపై చర్చించారు. ఈ నెల 7న చలో విజయవాడ కార్యక్రమంపై పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం 26వేలు ఇవ్వాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో లక్ష్మీపురం సర్పంచ్ త్రినాద్,విద్యుత్ కార్మికులు సునీల్,సత్తిబాబు,ఈశ్వరరావులు పాల్గొన్నారు.

క్షయపై అప్రమత్తత అవసరం



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు

హుకుంపేట: క్షయ వ్యాధిపై గిరిజనులు అవగాహన కలిగి ఉండి అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి డాక్టర్ సౌజాన్య, డాక్టర్ చిట్టపులి లక్ష్మి చెప్పారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక వైద్యాధికారులు సిబ్బందితో కలిసి వారపు సంతలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు గ్రామలో టీబీ లక్షణాలు కలిగి ఉంటే వైద్యాధికారులకు సమాచారం అందించాలన్నారు. టీబీపై ప్రతి ఒక్కరు అవగహన కలిగి ఉండాలన్నారు. టీబి వ్యాధి సోకకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. టీబీ సూపర్‌వైజర్ సదానందం తదితరులు పాల్గొన్నారు.

గంజాయి అనర్థాలపై అవగాహన

సీలేరు: గంజాయి అక్రమ రవాణా జోలికి వెళ్లొద్దని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గూడెం కొత్తవీధి సీఐ వరప్రసాద్ చెప్పారు. సీలేరు పోలీసుస్టేషన్ పరిధిలోని ధారకొండ, దుప్పులవాడ, గాలికొండ, సీలేరు పంచాయతీ పరిధిలో గతంలో గంజాయి కేసుల్లో ముద్దాయిలుగా ఉన్న వారికి ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి రవాణా, సాగు వంటి కేసుల్లో ఇరుక్కుంటే జైలు నుంచి బయటకు కాకుండా ఎన్డీపీఎస్ కేసు నమోదైనట్టు చెప్పారు. దీంతో పాటు వారు సంపాదించిన ఆస్తులను సీజ్ చేస్తామని సీఐ వరప్రసాద్, ఎస్ఐ రవీంద్ర పాల్గొన్నారు.